క్లుప్తంగా

రైతులు సభ్యత్వం తీసుకోవాలి



మరికల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని ధన్వాడ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి అన్నారు. మండలంలోని అప్పంపల్లి గ్రామంలో సోమవారం ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘంలో ప్రతి రైతు రూ. 2 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రతి రైతు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకట్రాములు, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌లో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం



మక్తల్: పట్టణంలోని రాంలీలా మైదానంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మక్తల్ మార్కెట్ చైర్మన్ గవినోళ్ల రాధమ్మ, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డిలు స్టాళ్లలో ఉంచిన తినుబండరాలతో పాటు ఇతర వస్తువులను పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల మహిళా సంఘాలను అభినందించారు. మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు.

నేడు పోచమ్మ తల్లి బోనాలు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో స్వయంభూగా వెలిసిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానిక భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై సామూహిక బోనాల ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలేరమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నర్వ: నర్వ, యాంకీ గ్రామాల్లో మంగళవారం పోలేరమ్మ బోనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాంకీ గ్రామ ఊర చెరువు కట్టపై వెలిసిన పోలేరమ్మ ఆలయంలో రెండు గ్రామాల ప్రజలు బోనాలు జరుపుకోవడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. దీని ప్రకారం ఈ ఏడాది కూడా ఉత్సవాలు జరుపుకొంటున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు



కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ వాడితే జరిమానాతో పాటు చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నాగరాజు హెచ్చరించారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం పట్టణంలోని హోటళ్లు, బేకరీలు, వ్యాపార సముదాయాలలో ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దుకాణాలపై దాడులు చేసి జరిమానా విధించారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే పలు వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మోహన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

బోరు ఏర్పాటుకు భూమిపూజ

నారాయణపేట టౌన్: జిల్లాలోని పలు కాలనీలో ఉన్న నీటి ఎద్దడిని అరికడతామని బీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ బీష్మరాజ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని 11 వార్డు పరిధిలోని వడ్డెబజార్ల ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బోరుకు కాలనీ వాసులతో కలిసి భూమిపూజ చేశారు. బజార్ల ప్రాంతంలో నీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో బోరు వేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, బీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లకు భవనాలు కరువు

- అద్దె ఇళ్లల్లో, పాఠశాల గదుల్లో నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

ఊట్కూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు , చిన్నారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను నెలకొల్పింది. అయితే వీటికి పక్కా భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిశు మరణాలను తగ్గించాలని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఊట్కూర్, చిన్నపొర్ల, పులిమామిడి, కొల్లూర్ గ్రామాల్లో ఒక్కొటి చొప్పున పక్కా భవనాలు ఉన్నాయి. మిగతా వాటికి పక్కా భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలల్లో అదనపు గదులు, కమ్యూనిటీ భవనాలలో, అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో అద్దెకు భవనాలు దొరకపోవడంతో చిన్న చిన్న గదుల్లోనే కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటికి ప్రభుత్వం నెలకు రూ.1000 అద్దె చెల్లిస్తుంది. అద్దె గదుల్లో సరియైన మౌలిక వసతులు లేకపోవడంతో చిన్నారులతో సహ అంగన్‌వాడీ టీచర్లు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో గర్భిణులకు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై సమావేశాలు, ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ తదితర కార్యక్రమాలను సరిగ్గా నిర్వహించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అద్దె గదుల్లో విద్యుత్, గాలి, వెలుతురు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఖాళీ స్థలం లేకపోవడంతో ఆట వస్తువులు నిరుపయోగంగా ఉంటున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు ఆట–పాటల ద్వారా పాఠాలు బోధించలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజలు, లబ్ధిదారులు కోరుతున్నారు.



ఊట్కూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



బిజ్వార్ పాఠశాలలో చిన్న గదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

మండలంలో ఇలా..

- పులిమామిడి పాఠశాలలోని ఓ తరగతి గదిలో మూడేళ్లుగా 4 అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే దగ్గర కొనసాగుతున్నాయి.
- ఊట్కూర్‌లో రెండు పాఠశాలల్లో ఒకే తరగతి గదిలో 2 అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనంలో 2 కేంద్రాలు నిర్వహిస్తున్నారు.
- పగిడిమారిలో పాఠశాలలో ఒకే అదనపు గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- తిప్రాస్‌పల్లి గ్రామంలో కమ్యూనిటీ భవనంలో ఓ కేంద్రాన్ని నెట్టుకొస్తున్నారు.
- బిజ్వార్‌లో పాఠశాలలో చిన్న గదిలో కేంద్రం కొనసాగుతుంది.
- అవుసలోనిపల్లి గ్రామంలో 3 కేంద్రాలు అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు.

కమ్యూనిటీ భవనంలో..



మా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏళ్ల నుంచి కమ్యూనిటీ భవనంలోనే కొనసాగిస్తున్నారు. ప్రతి నెల ఆసరా పింఛన్ల పంపిణీ సమయంలో కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకే గదిలో ఆటపాటలతో పాటు వంట వార్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనాన్ని మంజూరు చేయాలి.

–అశోక్, తిప్రాస్‌పల్లి, ఊట్కూర్

నిధులు మంజూరయ్యాయి

మండలంలోని చిన్నపొర్ల, మల్లెపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. పక్కా భవనాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వాటికి కూడా నిధులు మంజూరు అయితే పక్కా భవనాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

–రాజేశ్వరి, సూపర్‌వైజర్, ఊట్కూర్

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కూడా కాకముందే ప్రజావిశ్వాసం కోల్పోయిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు సాగుకు సన్నద్ధమైన సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నుంచి చెరువులకు సాగు నీరు విడుదల చేయకపోవడంపై మండిపడ్డారు. యాసంగిలో సాగునీరు అందించకపోవడంతో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని కనీసం ఇప్పుడైనా సంగంబండ నుంచి అమరచింత వరకు సాగునీరు అందించేందుకు మంత్రి కృషి చేయాలని కోరారు. అలాగే రైతులకు ఎరువులు, ఉచిత కరెంట్, రైతు భరోసా నగదు ఇంత వరకు జమ చేయలేదని దుయ్యబట్టారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేయడాన్ని ఖండించారు. తమ కార్యకర్తలను లేనిపోని కేసుల్లో ఇరికిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. వాకిటి శ్రీహరికి అదృష్టం కొద్ది మంత్రి పదవి వచ్చిందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి దానిని నిలబెట్టుకోవాలని కోరారు. ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మక్తల్ నియోజకవర్గం కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తే తాను సహకారిస్తానన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు నిధులు మంజూరు చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు పెట్టి పారిశుద్ధ్య పనులు చేయించి అప్పులపాలవుతున్నారన్నారు. అలాగే మక్తల్ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు మంజూరు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జుట్ల శంకర్, అన్వర్, నర్సింహరెడ్డి, కృష్ణ, మైమూద్, చిన్నమన్మంతు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు నిలిపివేయాలి



నిరసన తెలియజేస్తున్న రైతులు

దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా మండలంలోని కాన్‌కుర్తి శివారులోని దేశాయ్‌చెరువులో నిర్మిస్తున్న రిజర్వాయర్‌ను వెంటనే నిలిపివేయాలంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువు సమీపంలో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టగా తహసీల్దార్ తిరుపతయ్య ఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. రిజర్వాయర్ నిర్మాణంలో గ్రామానికి చెందిన రైతులు 700 ఎకరాలను కోల్పోవాల్సి వస్తుందని, వీరిలో ఎకరం, రెండెకరాలు భూమి ఉన్న చిన్న సన్నకారులే ఎక్కువగా ఉన్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని అప్పటి దాకా పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో స్థానిక రైతులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేసింది'



నెమళ్ల పల్లిలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న శివారెడ్డి

నారాయణపేట రూరల్: పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని అభంగాపూర్ పంచాయతీలోని నెమళ్లపల్లి గ్రామంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేస్తుందని, ఆరు గ్యారెంటీలు ప్రజలకు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్వేత, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, నాయకులు శరణప్ప, వెంకట్ రెడ్డి, రాజు పాల్గొన్నారు. విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాగులపల్లి నరేందర్, ఓం ప్రకాష్, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, మున్సిపల్ వార్డు అధికారి రఘువేందర్ పాల్గొన్నారు.

ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

కోస్గి రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సంపల్లి గ్రామంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ప్రొసీడింగ్ పత్రాలు అందజేసి నిర్మాణానికి భూమిపూజ చేశారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం

పేదలకు సొంతిల్లు ఇందిరమ్మ ఇళ్లు

మరికల్: పేదల కోసమే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో సోమవారం పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రెండో విడతలో మరికొంత మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాసులు, హరీష్, రామకృష్ణ, ఆంజనేయులు, రఘు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి



మక్తల్: పట్టణంలో శ్రీపడమటి ఆంజనేయ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మక్తల్ వచ్చిన ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 34, 35, 44లలో ఉన్న ఆలయ భూములను కాపాడాలని విన్నవించారు. ఆలయ భూములపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మల్లికార్జున్‌రావు, బి.రాహుల్, మూర్తి, నర్సింహరెడ్డి, బాల్‌రాజ్‌రెడ్డి, కర్ణిస్వామి, రాజశేఖర్‌రెడ్డి, కనకరాజు, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి కుమార్తె అరుణ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ డీకే అరుణ సోమవారం దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఊట్కూరు: మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన బైండ్ల బాలప్ప కూతురు అంజలి (22) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. యువతి ఆదివారం మక్తల్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు పెద్దకడ్మూర్‌లో వైద్యశిబిరం

నర్వ: పెద్దకడ్మూర్‌లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నర్వ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో క్షయవ్యాధి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతిపక్ష పార్టీలు సహకరించాలి



మరికల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల సోమవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని ఇందుకు ప్రతిపక్ష పార్టీలు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, వీరన్న, హరీష్, రామచంద్రయ్య, రామకృష్ణారెడ్డి, రాములు, రామకృష్ణ, చెన్నయ్య, రఘు, గోవర్ధన్, గోపాల్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప, మహేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకు కామిక్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

నారాయణపేట రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కామిక్ పోటీలు ఉపకరిస్తాయని ఎంఈఓ బాలాజీ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కామిక్ రైటింగ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. సమాజాన్ని చైతన్య పరచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అలాగే క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని అన్నింటిని సమానంగా తీసుకోవాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ విద్యాసాగర్, డీఎస్ఓ భాను ప్రకాష్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సత్యనారాయణ సింగ్ పాల్గొన్నారు.

16న సయ్యద్ సాహెబ్ ఉర్సు



ఆత్మకూర్: పట్టణంలో వెలసిన హజరత్ సయ్యద్ షా సాహెబ్, హజరత్ సయ్యద్ మౌలానా సాహెబ్ ఉర్సు ఉత్సవాలను ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16న రాత్రి 8 గంటలకు జమేదార్ వీధిలోని ఎక్బాల్‌బిన్ సయ్యద్ ఇంటి నుంచి గంధోత్సవం ఊరేగింపుగా ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 17న ఖత్మే ఖురాన్, ఫాతేహా కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం 12గంటలకు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇక్బాల్‌బిన్ సయ్యద్ తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఫాతేహా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

దామరగిద్ద: మండలంలోని గడిమున్కన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో పాఠశాలకు వచ్చిన ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమయపాలన పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. అనంతరం క్లస్టర్ జీహెచ్ఎం అన్నపూర్ణతో కలిసి ఉపాధ్యాయులు బోధనను పరిశీలించి చదవడం రాయడం, మాట్లాడటం వంటి చతుర్విధ ప్రక్రియలు విద్యార్థులు సాధించేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మాగనూర్: స్వామినాథన్ సిఫార్సులను అమలు చేసి పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని మాగనూర్, కృష్ణ సంయుక్త మండలాల అఖిల భారత ఐక్య రైతు సంఘం అధ్యక్షుడు ఆనంద్ కోరారు. సోమవారం మాగనూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మోదీ వ్యవసాయ ప్రత్యేక రంగాల ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని అమలు చేయాలని, రైతులు పండించిన వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భగవంతు, కిరణ్, భాస్కర్, రాము, మల్లేష్, గోపాల్, బాలకృష్ణ, భీమా నందు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం ఏర్పాటు చేయండి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోస్గి రూరల్: మున్సిపల్ శివారులో ఉన్న శ్మశాన వాటిక స్థలంలో వైకుంఠధామం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 1728లో 2 ఎకరాల స్థలంలో తరతరాల నుంచి మృతదేహాల ఖనన చేస్తుండగా కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వైకుంఠధామాలు ఏర్పాటు చేశారని శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, సామల వెంకటప్రసాద్ , గండె వెంకటయ్య , కుమ్మరి ఆంజలయ్య , రామకృష్ణ దోమరాజేశ్వర్ , చౌడాపూరం శ్రీనివాస్ , బ్యాగరి తదితరులు ఉన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేద్దాం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న లయన్స్ క్లబ్ సేవలను ప్రతి గడపకు చేరే విధంగా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ 48వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించారు. లయన్స్ క్లబ్ సేవలు పేదలకు చేరేలా మరింత విస్తృతం చేయాలని అందుకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఇద్దరు నిరుపేద మెడికల్ విద్యార్థులు, ఇద్దరు ఇంజనీర్ విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, నాగరాజు పాల్గొన్నారు.

మూత్రశాలలను బాగు చేయాలి



మాగనూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న మూత్రశాలలు అపరిశుభ్రంగా మారడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఒకే చోట దాదాపు పదుకు పైగా ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంతో అత్యవసరంగా వెళ్లాల్సి వస్తుంది. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలో పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా తయారు కావడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూత్రశాలలను బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.